కమనీయం.. శ్రీవారి కల్యాణం

అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

మదనపల్లె సిటీ : సర్వ జగద్రక్షకుడైన శ్రీవారు సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కతో సిగ్గులొలుకుతున్న ఉభయ దేవేరులను పెండ్లాడారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీవారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చారణల నడుమ కమనీయంగా జరిగింది.

ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు గోవర్ధన్‌భట్టార్, వేదపండితులు అమర, బాలాజీ, నవనీత్, నరేష్, జయసింహ, రోహిత్ ఘనంగా నిర్వహించారు. ముందుగా కళా సౌందర్యాలు, పూలతో కల్యాణ వేదికను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అనంతరం ఆలయంలో రెండు వేరువేరు వాహనాలపై శ్రీవారు, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. వేద మంత్రోచ్చారణల నడుమ, మేళతాళాలు, ,మంగళ వాయిద్యాలతో శ్రీవారు, అమ్మవార్ల వాహనాలను కల్యాణ వేదిక వద్దకు తీసువచ్చారు. కల్యాణానికి కోటవారిపల్లె ప్రజలు వస్త్రాలు అందజేశారు. రజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు అమర కల్యాణతంతు ప్రారంభించారు. శుభ ముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను భక్తుల గోవింద నామస్మరణల నడుమ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.


కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు


కల్యాణోత్సవంలో స్వామి, అమ్మవార్లు

గరుడ వాహనంపై విహరించిన వెంకన్న

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కమ్మవీధి, రీడింగ్‌రూము వీధి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, రంగస్వామినాయుడు, నాగేంద్ర, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో కోదండ రామస్వామి

ములకలచెరువు : మండలంలోని సోంపల్లెలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి విగ్రహానికి మహాభిషేకం చేసి, నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం స్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు.

యల్లమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ చీనేపల్లెలో వెలసిన శ్రీ చిన్నయల్లమ్మ, పెద్దయల్లమ్మ జాతరలో భాగంగా గురువారం అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఫ్రెండ్లీ వెల్ఫేర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా ఒస్కోటమ్మ ఉత్సవాలు


పూజలందుకున్న అమ్మవారు

గుర్రంకొండ : మండలంలోని సంగసముద్రం గ్రామదేవత ఒస్కోటమ్మ తల్లి తిరునాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం గ్రామంలో మహిళలు అమ్మవారికి బోనాలు, దివిటీలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మేళతాళాలతో, బాణాసంచా పేల్చుతూ పెద్ద ఎత్తున చాందిని బండ్లతో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరణతో వచ్చిన చాందిని బండ్లు అందర్నీ ఆకట్టుకొన్నాయి. అమ్మవారికి ఘనంగా పూజలు చేసి, మొక్కులు చెల్లించుకొన్నారు. బంధుమిత్రుల రాకతో పల్లెల్లో సందడి నెలకొంది.

రేపటి నుంచి అంకాలమ్మ తిరునాల


అంకాలమ్మ ఆలయం

పీలేరు రూరల్ : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లె వద్ద వెలసిన శ్రీ అంకాలమ్మ తిరునాల శనివారం నుంచి రెండు రోజుల పాటు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, హోమాలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, చాందినీ బండ్ల ప్రదక్షిణ, ఆదివారం బోనాలు సమర్పణ, మొక్కులు చెల్లింపు ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

శాంతియుత జీవనం సాగించాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలి సీఐ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అగ్రహారం, ఎనుమలవారిపల్లె, ఇందిరమ్మ కాలనీ, పెద్దగాండ్లపల్లెలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమల్లో ఉందని తెలిపారు. గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. కౌంటింగ్ అయిన పదిహేను రోజుల పాటు కూడా గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది విజయ్‌కుమార్, ముల్లంగ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మా.. చల్లంగ చూడమ్మా


కుండలతో జలాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

వాల్మీకిపురం : వాల్మీకిపురం గ్రామ దేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతరలో భాగంగా గురువారం పట్టణంలోని కోనేటివీధి, నాయక్ వీధిలోని గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన సేవలు నిర్వహించారు. పోతురాజు విగ్రహానికి పూజలు నిర్వహించి, జాతర చాటింపు వేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం మహిళలు బోణాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి పట్టణానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు సురేష్, అరుణ కుమారిలు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, కమిటీ చైర్మన్ మొర్రంరెడ్డి రాంకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, బలరాం, విజయవర్మ, ఆనంద శెట్టి, పూజారి జనార్ధన్, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా వేణుగోపాలస్వామి ఉట్లోత్సవం


కేసీపల్లెలో వేణుగోపాలస్వామి ఊరేగింపు

రామసముద్రం : మండలంలోని కుదురుచీమనపల్లెలో వెలసిన శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవాలలో భాగంగా గురువారం ఘనంగా ఉట్ల తిరునాల నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఉట్ల తిరునాల ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఉట్లోత్సవం తిలకించడానికి వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఉట్లోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా బండెమ్మ రథోత్సవం


ఎలకపల్లెలో రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

రామసముద్రం : మండలంలోని ఎలకపల్లె గ్రామంలో బండెమ్మ తిరునాలలో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు చుట్టు పక్కల భక్తులచే బండెమ్మ తిరుణాల వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేకంగా మహిళలు ఉపవాసలతో బోనాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. పచ్చని తోరణాలతో అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారిని పలు రకాల పుష్పాలతో పురవీధుల్లో రథంపై ఊరేగించారు. ఇంటింటా మహిళలు మంగళహారతులతో పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. జాతరకు బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

భక్తిశ్రద్ధలతో మొలకల పౌర్ణమి

మదనపల్లె : పట్టణంలోని అయోధ్యనగర్ శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో మొలకల పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి...పంటలు బాగా పండాలని కోరుతూ ప్రతి ఇంటి నుంచి సేకరించిన విత్తనాలను కుంపట్లలో వేసి 11 రోజుల పాటు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొలకల కుంపట్లను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అక్కడే ఉంచారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి మల్లికార్జునస్వామి, మేజారి మురళీధర్, ప్రభావతి, శారదమ్మ, మాధవరెడ్డి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లె : అయోధ్యనగర్ ఆలయంలో మొలకల కుంపట్లు

వైశాఖ పౌర్ణమి వేడుకలు

ములకలచెరువు : మండలంలోని వేపూరికోటలో వెలసిన శ్రీ చెన్నకేశ్వస్వామి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి విగ్రహానికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పండితులు వేద మంత్రాలతో శాంతి హోమం, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను ప్రధానం చేశారు.

లోదుక్కులతో బహుళ ప్రయోజనాలు


ఏడీఏ దీక్షాకుమారి

మదనపల్లె : మెట్ట ప్రాంతంలో వర్షాధారిత పంటలు పండించే రైతులు వేసవిలో దుక్కులు దున్నడంతో అనేక ఉపయోగాలున్నాయని ఏడీఏ దీక్షా కుమారి అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. వేసవిలో కురిసే వర్షాలను ఉపయోగించుకుని పొలాల్లో వాలుకు అడ్డంగా ఎర్రనేలలో ఒక మీటరు, నల్లరేగళ్లలో రెండుమీటర్ల చొప్పున లోతుగా దుక్కులు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయని, దీన్నే కాంటూరు సేద్యం అంటారని తెలిపారు. భూమిలో గట్టిపొరను కదిలించడం ద్వారా పంటలకు కీడుచేసే పురుగులు చాలావరకు కోశస్థ దశలోనే నశిస్తాయన్నారు. పంటకాలంలో చీడపీడలు, తెగుళ్ల ఉధృతి బాగా తగ్గుతుందన్నారు. నేల ఎండుతూ, ఆరుతూ ఉంటే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే వర్షపునీరు ఎక్కడికక్కడ ఇంకిపోయి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. బెట్ట ఏర్పడకుండా కాపాడుకోవడమే కాకుండా, సారవంతమైన మట్టి కొట్టుకుపోకుండా ఉంటుందన్నారు. కలుపు సమస్య బాగా తగ్గిపోతుందన్నారు. గాలిలో నైట్రేట్ రూపంలో ఉన్న నత్రజని, వర్షపునీటితోపాటు నేలకు అందడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. విత్తనం వేసే ముందు రెండుసార్లు నేలను బాగా దుక్కి చేసుకుంటే పంట దిగుబడులు గణనీయంగా పెరుగుతాయన్నారు. భూమి ఖాళీగా ఉంటే వేసవిలో మట్టి నమూనాలు తీసి భూసార పరీక్షలు చేయించాలన్నారు. ఆ తర్వాత ఫలితాలను అనుసరించి పోషకాలను సమర్థవంతంగా వినియోగిస్తే సేద్యం లాభదాయకంగా ఉంటుందన్నారు. మెట్టభూములతోపాటు పల్లం భూముల్లో కూడా వేసవిలో లోతుగా దుక్కులు చేసుకుంటే ఆశించిన ఫలితాలు పొందగలుగుతారన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్
- బహుజన సేన ఆధ్వర్యంలో బౌద్ధపౌర్ణమి వేడుకలు

మదనపల్లె : గౌతమ బుద్ధుడు చూపిన బాటలో నడుస్తూ ప్రశాంత జీవనం గడపాలని, ఆ మహనీయుడి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేలా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. బుద్ధ పున్నమిని పురస్కరించుకుని గురువారం బహుజనసేన వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీచందు ఆధ్వర్యంలో బౌద్ధ స్ఫూర్తి ర్యాలీ నిర్వహించారు. గొల్లపల్లె రింగ్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి బౌద్ధ స్ఫూర్తి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ శాంతి, సమానత్వం ప్రపంచానికి బోధించిన వ్యక్తి గౌతమబుద్ధుడని కొనియాడారు. తాత్విక బోధనలు, శాంతి, శీలం, సహనం అనే ధర్మాలతో సమాజంలో శాంతి స్థాపనకు బుద్ధుడు కృషి చేశారన్నారు. సామ్రాట్ అశోకుడి పాలనంతా బుద్ధుడి బోధనలపైనే నడిచిందన్నారు. గౌతమ బుద్ధుని బోధనలు, పంచశీల అష్టాంగమార్గాలు నేటికీ అనుసరణీయమని, వీటిని యావత్ ప్రపంచానికి పరిచయం చేసిన దేశం భారతదేశమేనన్నారు. భారతదేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బౌద్ధాన్ని అనుసరించారని, అంతటి బౌద్ధం నేటి యువతకు మార్గదర్శకమని తెలియజేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ తథాగతుడు చూపించిన మార్గం మనకు అనుసరణీయమని, దాన్ని నిజంగా పాటిస్తే మన జీవితంలో మహత్తరమైన మార్పు తథ్యమన్నారు. జీవితానికి ఏం కావాలో, ఎలా జీవించితే ఆనందంగా ఉంటామో చెప్పిన భగవానుడు గౌతముడన్నారు. బహుజనసేన వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీచందు మాట్లాడుతూ వైశాఖ పూర్ణిమను బుద్ధపూర్ణిమగా పిలుస్తారని, బుద్ధుడి జననం, బుద్ధుడికి జ్ఞానోదయం కలగడం, బుద్ధుడు నిర్యాణం చెందడం తదితర ముఖ్యఘట్టాలన్నీ వైశాఖమాసంలో వచ్చే పూర్ణిమరోజునే జరిగాయన్నారు. అందుకే బుద్ధపూర్ణిమ ఎంతో ప్రాశస్త్యం పొందిందన్నారు. ప్రపంచశాంతి కోసం ఆరాటపడిన వాళ్లలో బుద్ధుడు ఒకరన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, ఈశ్వరనాయక్, రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకులు రహీం, నూర్ మొహియుద్దీన్‌ఖాన్, కొత్తపల్లెమహేష్, బహుజనసేన నాయకులు కొండపల్లి ఆనంద్, రాఘవేంద్ర యాదవ్, మూడేరూపక్‌నాయక్, హరి, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బౌద్ధస్ఫూర్తి ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్

పోతబోలులో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయి పెంపు

మదనపల్లె : మండలంలోని పోతబోలు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంపు చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ యుగంధర్ తెలిపారు. గురువారం పోతబోలు సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఈ యుగంధర్ మాట్లాడుతూ పోతబోలు సబ్‌స్టేషన్ పరిధిలో ఓల్టేజీ సమస్య పరిష్కారంలో భాగంగా, పరిశ్రమలు, వ్యవసాయ విద్యుత్‌బోర్లు, గృహావసరాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చేసేందుకు 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఉన్నటువంటి 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సీటీఎం సబ్ స్టేషన్‌కు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌ఫార్మర్స్ ఈఈ మహేశ్వరరెడ్డి, ప్రొటెక్షన్ ఏఈ అజయ్‌బాబు, ఆనంద్, ఏడీ సతీష్, సురేంద్రనాయక్, సీటీఎం ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంలో విద్యుత్ అధికారులు

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ వెంకటరమణ

వాల్మీకిపురం : గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి, వెంటనే చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండల అభివృద్ధే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామన్నారు. మండలంలో జ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, గ్రామాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్పంచ్ గంగులమ్మ, వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఏవో షబ్బీర్ అహ్మద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

మదనపల్లె సిటీ : స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయానికి గురువారం మహిళా డిగ్రీ కాలేజీ అధ్యాపకురాలు, రచయిత్రి జి.మోహన్‌వల్లి రచించిన మనాలి స్మృతులు పుస్తకాలు అందజేశారు. గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రచయిత్రి మాట్లాడుతూ తాను కాలేజీ విద్యార్థులతో కలిసి మనాలి క్యాంపునకు వెళ్లానని, దీని ఆధారంగా పుస్తక రూపంలో రాసినట్లు తెలిపారు. విద్యార్థులు చదవాలన్న ఉద్దేశంతో పుస్తకాలను లైబ్రరీకి అందజేసినట్లు తెలిపారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు ఇంగ్లిషు గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. ప్రముఖ రచయిత టీ.ఎస్.ఏ.క్రిష్ణమూర్తి, శకుంతలమ్మ విద్యార్థులకు కథలు వినిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న రచయిత్రి మోహన్‌వల్లి

పాఠశాల అభివృద్ధికి కృషి

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ జాండ్రపేట జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఫ్రెండ్లీ వెల్ఫేర్ సంస్థ అధ్యక్షుడు ఎం.హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం జాండ్రపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి, గుడి అభివృద్ధి చెందితేనే గ్రామాలు ప్రగతి సాధిస్తాయన్నారు. అనంతరం గురువులు, గ్రామ పెద్దలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, హెచ్‌ఎం రుపనిత, ఫ్రెండ్లీ వెల్ఫేర్ సంస్థ సభ్యులు ధనుంజయరెడ్డి, హరినాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామస్వామిరెడ్డి, దేవరాజులురెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైవీ రమణ, రాజారెడ్డి, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, కాలయ్య తదితరులు పాల్గొన్నారు.



29 నుంచి వేరుశనగ విత్తనకాయల పంపిణీ

ములకలచెరువు : రైతులకు ఈ నెల 29వ తేదీ నుంచి సబ్సిడీ పైన వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు అగ్రికల్చర్ అధికారి లీలాకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 4 వేల క్వింటాళ్ల విత్తనకాయలు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఆర్బీకే కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కే6 రకం 30 కేజీల బ్యాగు ధర రూ.1,710 అని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


భోజనం వడ్డిస్తున్న భాగ్యలక్ష్మి

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు వృద్ధాశ్రమంలో గురువారం మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి కుమారుడు శివసాయి రాఘవేంద్రరెడ్డి జ్ఞాపకార్థం దివ్యాంగులు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వెలుగు సంస్థ నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ సతీమణి, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు


ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

మదనపల్లె సిటీ : స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం మంజుశ్రీ టెక్నో ప్యాక్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. డిప్లమా విద్యార్థులకు హెచ్‌ఆర్ మేనేజర్ పురుషోత్తం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 20 మంది విద్యార్థులను డిప్లమా ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కె.ఓబులేసు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హరిప్రసాద్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సావిత్రి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధికి బీజీసీ వ్యాక్సిన్

తంబళ్లపల్లె : మండలంలో క్షయవ్యాధిని పూర్తిగా నివారించేందుకే ముందస్తు చర్యలలో భాగంగా బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు కోసువారిపల్లె పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అనుపమ, డాక్టర్ శివకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని 12 హెల్త్‌క్లీనిక్‌లలో బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించి 243 మందికి వ్యాక్సిన్ వేసినట్లు ఆయన పేర్కొన్నారు. గత వారం నుంచి ఇప్పటి వరకు 512 మందికి వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

– ఎస్ఐ వెంకట్‌శివకుమార్



తంబళ్లపల్లె : మండలంలో అమ్మవారి జాతర తిరునాళ్ల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ వెంకటశివకుమార్ తెలిపారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున బాణాసంచా పేలుళ్లు, రికార్డు డ్యాన్సులు వంటి కార్యక్రమాలు నిషేధమన్నారు. చాందినీబండ్లలో మైకు ఏర్పాటు చేయాలనుకున్న వారు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఈ జాతర్లు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. గృహాలలో పేలుడు పదార్థాలు నిల్వ ఉంచకూడదన్నారు.

మాలల హక్కులపై పోరాడుతాం


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు నాయకులు

వాల్మీకిపురం : మాలల హక్కులపై పోరాడుతామని మాలమహానాడు జాతీయ కన్వీనర్ నరసింహారావు అన్నారు. గురువారం వాల్మీకిపురానికి వచ్చిన ఆయన స్థానిక గాంధీ బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయంగా మాలలు ఎదగాలన్నారు. మాలలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి మహేష్, సభ్యులు ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.